క్లుప్తంగా...

బోడుప్పల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో 86 శాతం ఉత్తీర్ణత

బోడుప్పల్: బోడుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో కలిపి 86 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. బోడుప్పల్‌లో ఆయన గురువారం మాట్లాడుతూ మొత్తం 113 మంది విద్యార్థులు ఉండగా వారిలో 97 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. స్పందన, శరణ్య 9.5/10జీపీఏ, నిత్య 9.3, చింతల శైలజ 9.2, షేక్ అఫ్రిన్, మమత, రమ్యశ్రీ 9 జీపీఏ సాధించగా వారిని ఆయన అభినందించారు.

'కేటీఆర్‌ను అడ్డుకుంటాం'

ఉప్పల్: ఉప్పల్ స్కైవాక్ ప్రారంభోత్సవానికి రానున్న మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను అడ్డుకుంటామని బీజేవైఎం నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్లమెంట్ ఇన్‌చార్జి రెవెల్లి రాజు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఏళ్లు గడిచినా పనులు అసంపూర్తిగానే మిగిలి పోతున్నాయని, ఇంకా పనులు పూర్తికాని ఉప్పల్ స్కైవాక్ వంతెనను మంత్రి ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. పాలిటెక్నిక్ కళాశాల భవనం అప్పటి ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రారంభిస్తే ఇప్పటి వరకు పూర్తి చేయలేదని గుర్తు చేశారు. నిరుద్యోగ భృతి రూ.3,016 ఇస్తానని ఇప్పటి వరకు ఎందుకు ఇవ్వలేదో మంత్రి తెలపాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొప్పలు తప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఉప్పల్ స్కైవాక్ వంతెన ప్రారంభోత్సవానికి రానున్న కేటీఆర్‌ను అడ్డుకొని తీరుతామని హెచ్చరించారు. తెలంగాణ సంపత్, చెన్నోజు హరీష్, నాని నాగరాజు, దప్పు దత్తసాయి, అఖిలేష్ గౌడ్, శ్రీకాంత్, సోము బాలకృష్ణ పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



మేడిపల్లి: కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. 26వ డివిజన్ వార్డు కార్యాలయం శంకర్‌నగర్‌లో కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కమిషనర్ బి.వంశీకృష్ణతో కలిసి గురువారం కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్పొరేటర్లు భీమ్‌రెడ్డి నవీన్‌రెడ్డి, అమర్‌సింగ్, కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, సీనియర్ నాయకులు యాసారం మహేష్, బండి శ్రీరాములుగౌడ్, బండి సతీష్ గౌడ్, వైద్యాధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జానకి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మచ్చబొల్లారం డివిజన్ అభివృద్ధికి కృషి



అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. డివిజన్ పరిధిలోని కౌకూర్ ప్రశాంత్‌నగర్‌లో రూ.75 లక్షలతో థీమ్ పార్కు అభివృద్ధి, మరో రూ.75 లక్షలతో మంజీరా మంచినీటి సరఫరా కోసం పైపులైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని దాదాపు 50 నుంచి 60 కాలనీలు కొత్తగా వెలిశాయని, అంచెలంచెలుగా వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. జలమండలి మేనేజర్ సునీల్, డీజీఎం భాస్కర్, మేనేజర్ మల్లికార్జున్, జీహెచ్ఎంసీ డీఈ మహేష్, ఏఈ స్వాతి, కాలనీవాసులు గురునాథరావు, తివారి, పెద్ది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

ఉప్పల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఉప్పల్ పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. అంబర్‌పేట పటేల్‌నగర్ ప్రాంతవాసి నజీమ్(22) రామంతాపూర్ వెంకటరెడ్డినగర్‌లో ఇద్దరు బాలురతో రేషన్ బియ్యాన్ని సేకరిస్తారు. ఆ బియ్యాన్ని పటేల్‌నగర్‌లోని ఓ ఇంట్లో ఉంచుతారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వ్యక్తితో పాటు ఇద్దరు బాలురను అదుపులోకి తీసుకుని 12 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో రామంతాపూర్ వాసవినగర్‌లో రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్న అంబర్‌పేట ప్రాంతానికి చెందిన ఎండీ జహీర్(24)ను అదుపులోకి తీసుకుని 25 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాలురను జువైనల్ హోంకు తరలించారు.

ఆధునిక సౌకర్యం.. మెరుగైన వైద్యం

గాంధీకే సౌధ్యం

రూపురేఖలు మారనున్న గాంధీ ఆస్పత్రి

- ప్రారంభానికి సిద్ధంగా మూడు భవన సముదాయాలు
- అందుబాటులోకి మరింత మెరుగైన వైద్యసేవలు

గాంధీఆస్పత్రి: తెలంగాణ వైద్య ప్రదాయినీ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి రూపురేఖలు మారనున్నాయి. అత్యాధునిక సదుపాయాలు, కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన మూడు నూతన భవన సముదాయాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. గాంధీ అత్యవసర విభాగం వెనుక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో (మ్యాచింగ్ గ్రాంట్) నిర్మిస్తున్న మాతాశిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)తో గర్భిణులు, బాలింతలు రెండింతలు, రోగి సహాయకుల సంఖ్య నాలుగింతలు పెరిగే అవకాశం ఉందని భావించిన ఆస్పత్రి అధికారులు తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఎంసీహెచ్ భవనం పక్కనే అత్యాధునిక డైట్ క్యాంటిన్ భవన నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. డైట్ క్యాంటిన్‌లో తయారు చేసిన ఆహార పదార్థాలను ఇన్ పేషెంట్ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులకు అందించేందుకు ప్రత్యేక ఆకాశ వంతెనలు (స్కై బ్రిడ్జి) నిర్మించనున్నారు. ఓపీ విభాగం ముందు ప్రైవేటు మెడికల్ షాపుల భవనంపైన నిర్మించిన మరో అంతస్తులో నైట్ షెల్టర్ అందుబాటులోకి రానుంది.

రూ.50 కోట్లతో ఎనిమిది అంతస్తుల్లో..

రూ. 50 కోట్ల వ్యయంతో జీ+8 అంతస్తుల్లో చేపట్టిన మాతాశిశు సంరక్షణ భవన నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. అధునాతన వైద్య యంత్రాలు, పలు రకాల వసతులు, సౌకర్యాలతో కూడిన ఐసీయూ, ఆధునిక ఆపరేషన్ థియేటర్లతో పాటు మరో రెండు వందల పడకలు అందుబాటులోకి వస్తాయి. రాష్ట్రవ్యాప్తంగా జరిగే హైరిస్క్ ప్రసవాలను ఇక్కడే నిర్వహించి తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడతారు. ప్రధాన భవనంలో కొనసాగుతున్న గైనకాలజీ, పీడియాట్రిక్ విభాగాలను ఇక్కడకు తరలించి, తల్లీ బిడ్డలకు ఒకేచోట మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తారు. గైనకాలజీ, పీడియాట్రిక్, అనస్తీషియాతో పాటు పలు రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యులు నిరంతరం అందుబాటులో ఉంటారు. ప్రస్తుతం గాంధీలో నెలకు సుమారు 800 ప్రసవాలు జరుగుతుండగా, ఎంసీహెచ్ భవనం అందుబాటులోకి వస్తే ప్రసవాల సంఖ్య రెట్టింపు అవుతుంది.

సాక్షి వరుస కథనాలతో స్పందన

రెండు దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న డైట్ క్యాంటిన్ సమస్య మంత్రి హరీష్‌రావు చొరవతో పరిష్కారమైంది. రూ.2.25 కోట్ల నిధులు కేటాయించడంతో అత్యాధునిక హంగులతో చేపట్టిన నూతన డైట్ క్యాంటిన్ భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఆస్పత్రి డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరడంతో మురుగునీరు సెల్లార్‌తోపాటు డైట్ క్యాంటిన్‌ను ముంచెత్తింది. తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతున్న మురుగు మధ్యలోనే ఆహార పదార్థాలు తయారు చేయడాన్ని స్వయంగా చూసిన పలువురు వైద్యులు డైట్ క్యాంటిన్ భోజనాన్ని తిరస్కరించారు. గతంలో పర్యటించిన జిల్లా కలెక్టర్, గాంధీ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) చైర్మన్ శర్మన్ మురుగుతో నిండిన డైట్ క్యాంటిన్‌ను చూసి ఖంగుతున్నారు. మురుగుతో నిండిన డైట్ క్యాంటిన్‌పై సాక్షి దినపత్రిక పలుమార్లు ప్రధాన శీర్షికతో కథనాలు ప్రచురించగా స్పందించిన మంత్రి హరీష్‌రావు నిధులు కేటాయించారు.

సీడీఎంఏ ఆధ్వర్యంలో నైట్ షెల్టర్..

కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) ఆధ్వర్యంలో రూ.91 లక్షల వ్యయంతో గాంధీఆస్పత్రి ప్రాంగణంలో చేపట్టిన నైట్‌షెల్టర్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రోగితోపాటు సహాయకులుగా ఒకరికి మాత్రమే వార్డులోకి అనుమతి ఉంది. రోగిని డిశ్చార్జి చేసేంత వరకు మిగిలిన కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ప్రాంగణంలోని వెయిటింగ్ షెడ్లు, చెట్లు కింద రోజుల తరబడి ఉంటున్నారు. గాంధీ ఇన్‌పేషెంట్ విభాగంలో నిత్యం సుమారు 2 వేల మంది చికిత్సలు పొందుతుంటారు. రోగి సహాయకులు కాలకృత్యాలు, రాత్రి వేళ నిద్రించేందుకు నిర్మించిన షెల్టర్‌హోంలో మొత్తం వంద పడకలు ఏర్పాటు చేసి స్త్రీ, పురుషులకు వేర్వేరుగా కేటాయించారు.



చివరి దశలో మాతాశిశు సంరక్షణ భవనం



కొనసాగుతున్న డైట్ క్యాంటిన్ భవన నిర్మాణం

త్వరలోనే అందుబాటులోకి



గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో మాతాశిశు సంరక్షణ కేంద్రం, డైట్ క్యాంటిన్, నైట్‌షెల్టర్ భవన సముదాయాల నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. వైద్యమంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా త్వరలోనే అందుబాటులోకి తెచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం. నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించి సీఎం కేసీఆర్ ఆశలు, ఆశయాలకు అనుగుణంగా ఆరోగ్య తెలంగాణ ఆవిష్కరణకు మా వంతు కృషి చేస్తాం.

-ప్రొఫెసర్ రాజారావు, గాంధీ సూపరింటెండెంట్

వైద్యసేవల్లో నర్సులు కీలకం

సాక్షి, సిటీబ్యూరో: ఆరోగ్య సేవలు అందించడంలో నర్సుల పాత్ర కీలకమని ఐహెచ్‌హెచ్ హెల్త్‌కేర్ ఇండియా నర్సింగ్ డైరెక్టర్ డా.జ్యోతీ క్లారా మైఖేల్ అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ డిజిటల్ విప్లవాన్ని అందిపుచ్చుకుంటే డిమాండ్ కొరతల మధ్య వ్యత్యాసంతో పాటు పలు అంతరాలను తగ్గించవచ్చన్నారు. దేశంలో అవసరమైన ప్రతి రోగికీ సేవలు అందేలా కృషి చేయాలని నర్సులకు పిలుపునిచ్చారు.

స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా నాగమణి



అల్వాల్: అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్ ఏ.నాగమణి స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ పదోన్నతి లభించడం సంతోషంగా ఉందన్నారు. దీంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు.

బస్తీ దవాఖానాను సద్వినియోగం చేసుకోవాలి



కుషాయిగూడ బస్తీ దవాఖానాలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సూచించారు. గురువారం ఆమె కుషాయిగూడ వార్డు కార్యాలయంలోని బస్తీ దవాఖానాను సందర్శించారు. వైద్యం కోసం వచ్చే వారితో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. బస్తీ దవాఖానాల్లో అన్ని రకాల వైద్య పరీక్షలతో పాటు మందులు అందుబాటులో ఉన్నాయని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శైలజ, బీఆర్‌ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, రవి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికే ప్రాధాన్యం



రామంతాపూర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్



నాచారంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

రామంతాపూర్: సీఎం కేసీఆర్ నేతృత్వంలో టీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలుగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికే ప్రాధాన్యం ఇస్తూ ప్రజల అభిమానాన్ని పొందుతోందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. రామంతాపూర్ ప్రగతినగర్‌లో రూ.18 లక్షలతో నిర్మించే బాటిల్ నెక్ సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో రాజకీయాలకు ఆస్కారం లేకుండా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్, ఆసరా పెన్షన్లు అందిస్తూ ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ నాగేందర్, డీఈ నాగమణి, ఏఈ శ్వేత, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్‌ఎస్ నేతలు జనంపల్లి వెంకటేశ్వరెడ్డి, గణిత సుధాకర్, మహ్మద్ ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దఎత్తున అభివృద్ధి పనులు

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో సుమారు రూ.93 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. రాఘవేంద్రనగర్‌లో రూ.52 లక్షలతో సీసీ రోడ్డు పనులు, సావర్కర్‌నగర్‌లో రూ.14.60 లక్షలతో సీసీ రోడ్డు పనులు, బాబానగర్, సంస్కృతిహిల్స్ కాలనీలో రూ.17 లక్షలతో సీసీ రోడ్డు, హనుమాన్‌నగర్‌లో మురుగు నీరు ట్రంక్ లైన్ పనుల కోసం రూ.11.30 లక్షలతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. ఈఈ హరిలాల్, డీఈ రూప, ఏఈ లింగారావు, ఇర్క్‌ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం



మచ్చబొల్లారంలో పాదయాత్ర చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

అల్వాల్: హామీల అమలులో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. గురువారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రను ఆయన ప్రారంభించారు. కుమ్మరిబస్తీ, హరిజనబస్తీ, తెనుగు బస్తీ, కటిక బస్తీల్లో పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన ధరలు తగ్గిస్తామన్నారు. గ్యాస్ సిలిండర్ ధర రూ.500లకే ఇస్తామన్నారు. నిరుద్యోగ భృతి కల్పిస్తామన్నారు. యువకులకు ఉద్యోగ భద్రత ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పవన్, శ్రీనివాస్, సూర్యప్రకాష్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, బలరామ్, రాజు, పర్వాతాలు, సంతోష్‌రెడ్డి, సతీష్, దుర్గేష్, అరవింద్, శ్రీనివాస్, రాజలింగం, వాసు, పాండు, శివ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

అల్వాల్: ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓల్డ్ అల్వాల్ భవానినగర్‌లో నివాసముండే రాకేష్(33) స్థానికంగా బోర్‌వెల్ పనిచేస్తుంటాడు. ఇతడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందులే కారణమై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా రాజు



మౌలాలి: మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి.రాజు గ్రేడ్–1 మున్సిపల్ కమిషనర్ పదవి నుంచి స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా సర్కిల్ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

డ్రైనేజీల్లోని వ్యర్థాలను తొలగించాలి



మట్టి తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: డ్రైనేజీల్లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం అన్నపూర్ణ కాలనీలోని జనప్రియ టౌన్‌షిప్‌లో జరుగుతున్న డ్రైనేజీలోని మట్టి తొలగింపు పనులను కార్పొరేటర్ పరిశీలించారు. వర్షాకాలం రాకముందే డివిజన్ పరిధిలోని డ్రైనేజీల్లో మట్టి తొలగింపు పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ శ్రవంతి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, రామారావు, స్థానిక నేతలు శ్రీనివాస్‌గౌడ్, పీఆర్ ప్రవీణ్, మోహీన్‌పాషా, ప్రభాకర్‌రెడ్డి, రఘు తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కార్పొరేటర్ బన్నాల గీత జన్మదినోత్సవంలో మంత్రి సత్యవతి రాథోడ్

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని చిలుకానగర్ డివిజన్ వార్డు కార్యాలయానికి విచ్చేసిన రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ కార్పొరేటర్‌ను దీవించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా కృషి చేయాలని కోరారు. ప్రజలతో ఉన్న నాయకులకే తిరిగి వారే పట్టం కడతారన్నారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, వేణుగోపాల్‌రెడ్డి, ఫొటో బాలు తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న బండి సంజయ్

అల్వాల్: ఆత్మవిశ్వాసంతో సాధన చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన అల్వాల్‌కు చెందిన పలువురు విద్యార్థులు బండి సంజయ్‌ని కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

10వ తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులు



విక్టరీ చూపుతున్న లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ మంజులరాణి

బోడుప్పల్: లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటినట్లు ఆ పాఠశాల చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ 11 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించినట్లు వెల్లడించారు. 29 మంది విద్యార్థులు 9.8 జీపీఏ సాధించగా 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కోమటిరెడ్డి మంజులరాణి, ప్రధానోపాధ్యాయురాలు లీనా వారణాసి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాజ్యోతి స్కూల్‌లో..

చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో విద్యార్థిని పి.వైష్ణవి 10/10 జీపీఏ సాధించినట్లు ఆ పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పవిత్ర 9.8/10, ఐశ్వర్య 9.7, చరణ్‌తేజ 9.5, అఖిల, పంచాక్షరి 9.3, దుర్గప్రసాద్, హర్షిత, తేజశ్విని 9.2 జీపీఏ సాధించగా వారిని అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



నాలా పనులను పరిశీలిస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. 2వ డివిజన్ ఇందిరానగర్ కాలనీలో రూ.8 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు, 15వ డివిజన్‌లో రూ 9.30 లక్షల వ్యయంతో డ్రైనేజీ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా అన్ని డివిజన్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం సుద్దకుంట ప్రాంతంలో ఎత్తు తగ్గించి నాలాను నిర్మించినట్లు ఆరోపణలు రావడంతో ఆయన పరిశీలించారు. ఎత్తు తగ్గించడం వల్ల వర్షపు నీరు రోడ్డుపైకి వచ్చే ప్రమాదం ఉందని, వెంటనే రోడ్డు వేసి స్థానిక ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మిరవిగౌడ్, కార్పొరేటర్ కొత్త దుర్గమ్మగౌడ్, నాయకులు కొత్త రవిగౌడ్, కాటపల్లి రాంచంద్రారెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.